నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 16-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:13 పేజీలు: 4 వెల: రూ.1/-

ప్రగతిభవన్‌లో జాతిపితకు నివాళులర్పించి పతాకావిష్కరణ చేస్తున్న సిఎం కెసిఆర్

ప్రగతిభవన్‌లో జెండా ఆవిష్కరించిన సిఎం కేసీఆర్

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ ప్రగతి భవన్‌లో 74వ స్వాతంత్య దినోత్సవ వేడుకలు జరిగాయి. వేడుకలను శనివారం ప్రగతి భవన్‌లో నిరాడంబరంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ ముఖ్యనాయకులు, అధికారులతో కలిసి జాతీయ పతాకం ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అంతకుముందు ఆయన మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. దేశానికి వారి చేసిన త్యాగాలను గుర్తు

కరోనాతో నిరాడంబరంగా జెండా పండగ

చేసుకున్నారు. జాతీయ జెండాను ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు ఆవిష్కరించారు. కేవలం ముఖ్యనాయకులు, కొద్దిమంది అధికారుల సమక్షంలోనే ఈ వేడుకలను నిర్వహించారు. అనంతరం సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్‌కు వెళ్ళి అమరులకు నివాళర్పించారు. దీనిలో భాగంగా దేశానికి సేవ చేసిన వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్రం ఆవిర్భావం దగ్గర్నుంచీ గోల్కొండ కోటలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. అయితే కరోనా వైరస్ వ్యాప్తి వల్ల ఈసారి వేడుకల వేదికను ప్రగతి భవన్‌కు మార్చారు.ఆయన వెంట పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరునగరికి దాశరథి పురస్కారం అందచేత

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): మహాకవి దాశరథి కృష్ణమాచార్య-2020

ఆయన నూటికి నూరుశాతం అర్హుడన్న కేసీఆర్

మహాకవి దాశరథి పురస్కారం- 2020ని శనివారం ప్రగతి భవన్‌లో రామానుజంకు అందించి,శాలువా కప్పి సన్మానిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త తిరునగరి రామానుజయ్యకు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ అందజేశారు. అవార్డుతో పాటు రూ. 1,01,116 నగదు, జ్ఞాపికను అందజేసి శాలువాతో రామానుజయ్యను సీఎం సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ దాశరథి పురస్కారం పొందడానికి రామానుజం వందకు వందశాతం అర్హుడని సీఎం అన్నారు. ఆయన రాసిన బాలవీర శతకం, అక్షరధార, తిరునగరీయం లాంటి రచనలు ఎంతో ప్రజా ఆదరణ పొందాయన్నారు. సంప్రదాయ, సంస్కృత భాష పరిజ్ఞానం కలిగి ఉండడంతో పాటు ఆధునిక సాహిత్య అవగాహన కలిగిన సాహితివేత్తగా రామానుజం నిలుస్తారని సీఎం కేసీఆర్ అభినందించారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, సిఎస్ సోమేశ్ కుమార్, డిజిపి మహేందర్ రెడ్డి, దేశిపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఎం కేసీఆర్ పాడి వినిపించిన పద్యం అందరినీ ఆకట్టుకున్నది.

చరిత్రలో నేటినిజం

కం॥ సరియన్నదీ లేని సరళ
పరిపాలన పైన ఆనదు పట్టును జూపన్
కరయుగళి మోడ్చి పలచెద
పరిపరిశమున కొట్ల విజయ భాస్కరరెడ్డినే !!

(ఆగస్టు 16 కోట్ల విజయభాస్కర రెడ్డి జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

జాతిపితకు నివాళి అర్పించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): దేశరాజధాని ఢిల్లీలో 74వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కరోనా నేపథ్యంలో పండ్రాగస్టు వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేశారు. అంతకు ముందు రాజ్‌ఘాట్ వద్ద జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఎర్రకోటకు చేరుకొని, సైనికుల నుంచి గౌరవ వందన స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వేడుకల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. కరోనా నేపథ్యంలో అందరు మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటించారు.

అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు

హైదరాబాద్,ఆగస్ట్15 (ఆర్ఎన్ఎ):ఒడిశాలోని ఉత్తర కోస్తా, దానిని ఆనుకొని ఉన్న పశ్చిమబెంగాల్‌లోని ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. ఇది 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉన్నట్టు ఆయన వివరించారు. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుకుగా ఉన్నట్టు తెలిపారు. శని, ఆదివారాలు రాష్ట్రంలోని చాలాప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, పలుచోట్ల భారీ వానలు కురిసే అవకాశం ఉన్నట్టు చెప్పారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రంలో అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురంలో 16 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం రోజంతా ముసురేసింది. చలి తీవ్రత పెరిగింది.

కాళేశ్వరంతో ఉమ్మడి నల్లగొండకు వరం

పచ్చగా మారిన సూర్యాపేట

మూసీ నుంచి నీటిని విడుదల చేసిన మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నంతో వచ్చిన కాళేశ్వరం గోదావరి జలాలతో సూర్యాపేట జిల్లా మొత్తం పచ్చగా మారిందని మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. గత యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో అత్యధిక దిగుబడులు సాధించిన జిల్లాగా ఉమ్మడి నల్లగొండ జిల్లా రికార్డ్ సృష్టించిందని గుర్తుచేశారు. మూసీ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు మంత్రి జగదీష్ రెడ్డి నీటిని విడుదల చేశారు. మూసి ప్రాజెక్ట్‌ను ఆధునీకరించడంతో చివరి భూములకూ నీరందుతోందన్నారు. నిజాంకాలంలో నిర్మించిన మూసీ ప్రాజెక్ట్‌ను గత పాలకులు ఏనాడూ పట్టించుకోలేదని మంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి రూ. 21 కోట్లతో మూసి ప్రాజెక్ట్‌ను ఆధునీకరించడంతో చివరి భూములకూ నీరందుతోందని తెలిపారు.

ఆత్మనిర్భర భారత్ మన లక్ష్యం

ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగురేసిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని.. భారత స్వాతంత్ర్య సంగ్రామం ప్రపంచానికి ఒక దీప శిఖలా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. సవాళ్లు మన సంకల్పాన్ని మరింత సుధృడం చేస్తాయన్నారు.74వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోటపై తివర్ణ పతాకాన్ని ఎగుర వేసి, దేశప్రజలనుద్దేశించి మాట్లాడారు. భారతీయ రక్షణ దళాలు, పోలీసులు దళాలు మనల్ని నిరంతరం రక్షిస్తున్నాయన్నారు. దేశ సరిహద్దులో అంతర్గత భద్రతను కాపాడుతున్న సైనికులు పోలీసులకు వందనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంతో పాటు దేశం విపత్కర పరిస్థితుల్లో పయణిస్తోందని, కరోనా తెచ్చిన ముప్పు ప్రపంచాన్ని పట్టి పీడిస్తోందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పని చేస్తున్న వైద్య సిబ్బందికి ప్రణామం చేశారు. మహమ్మారి నివారణకు వైద్యులు, నర్సులు, అంబులెన్స్ డ్రైవర్లు అందరూ ప్రజల ఆరోగ్యానికి కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కరోనా ఒక్కటే కాదు దేశవ్యాప్తంగా వరదలు, ప్రకృతి విపత్తులు మనల్ని చుట్టు ముట్టాయన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకతాటిపై ఉండి విపత్తులను ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 5 ఏళ్లు వచ్చిన ప్రతి బిడ్డ సొంత కాళ్లపై నిలబడాలని కుంటుంబం కోరుకుంటుందని, ఈ క్షణం స్వయం సమృద్ధికి బలమైన సంకల్పంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఆత్మనిర్భర్ అనేది కేవలం నినాదం కాదని, ఆత్మనిర్భర్ భారత్ కోసం మనందరి సంకల్పం కావాలన్నారు. దేశ యువత ఆత్మవిశ్వాసంతో ఆత్మనిర్భర్ భారత్ సాధించాలని చెప్పారు. భారత్ అంటే క్రమశిక్షణ మాత్రమే కాదు ఉన్నత విలువలతో కూడిన జీవనమన్నారు. ప్రపంచం ఇప్పుడు పరస్పర ఆధారితం.. ఏ ఒక్కర ఏకాకిగా మనలేరన చెప్పారు. విశ్వకల్యాణానికి మనవంతు కూడా నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

వస్తూత్పత్తిలో ముందడుగు వేద్దాం

ఆత్మనిర్భర్ భారత్ అంటే ప్రపంచంతో మరింత మమేకం కావడమన్నారు. మన శక్తి ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మలచుకోవాలని సూచించారు. ఇంక ఎంతకాలం ముడి పదార్థాల ఎగుమతి దారుగా మిగిలిపోదాం అని ప్రశ్నించారు. ప్రపంచానికి కావాల్సిన వస్తు ఉత్పత్తిని అత్యున్నత ప్రమాణాలతో తయారు చేద్దామని పిలుపునిచ్చారు. ఆధునిక వస్తు ఉత్పత్తే ఆత్మనిర్భర్ భారత్ అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ అంటే మన రైతులు నిరూపించి చూపారని, భారత్‌ను ఆకలి రాజ్యం నుంచి అన్నదాతగా మార్చారని కొనియాడారు. మన రైతులే ప్రేరణగా అన్ని రంగాల్లో ఆత్మనిర్భర్ భారత్‌ను సాధిద్దామన్నారు. భారత్ తయారీ వస్తువులను ప్రపంచం ఆదరించేలా వస్తు ఉత్పత్తి చేద్దామన్నారు. భారత్ అంటే నాణ్యమైన వస్తువుల అడ్డా అన్న ఆత్మగౌరవాన్ని తేవాలన్నారు. ఒక నాడు భారత వస్తువులంటే విశ్వవ్యాప్తంగా గౌరవం ఉండేదని, మళ్లీ భారత వస్తువులకు పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం చేయాలన్నారు. ఇదే సందర్భంలో ప్రతి పౌరుడికి ప్రత్యేక నంబర్‌తో కార్డు ఏర్పాటు చేస్తున్నామని మోదీ ప్రకటన చేశారు. తద్వారా పౌరులకు అందిన వైద్యం వివరాలు కార్డులో నమోదవుతాయన్నారు. దేశంలో ఏ డాక్టర్ దగ్గరకు వెళ్లిన కార్డు ద్వారా వివరాలు తెలుస్తాయని మోదీ తెలిపారు. దేశ వ్యాప్తంగా వైద్య కాలేజీలు, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నేటి నుంచి జాతీయ డిజిటల్ హెల్త్ మిషన్ ప్రారంభించనున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వతంత్య భారతంలో ఎన్నో సాధించామని, మనం ఇంకా సవాళ్లు ఎదుర్కొంటున్నామన్నారు. 75 ఏళు పూర్తయ్యే సరికి మరో ముందడు వేస్తామని స్పష్టం చేశారు. ప్రాణాలు తృణప్రాయంగా వదలి మన పూర్వీకులు

స్వయం సమృద్ధికి బలమైన సంకల్పం
కరోనాను ఎదుర్కొనేలా కార్యాచరణ సన్నద్ధం
దేశ సరిహద్దుల్లో పటిష్ట నిఘాతో గట్టి జవాబు
ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చేలా వ్యక్తిగత ఆరోగ్యకార్డు
భారత స్వాతంత్ర్య సంగ్రామం ప్రపంచానికి ఒక దీప శిఖ
ప్రపంచ అవసరాలకు అనగుణంగా వస్తు ఉత్పత్తి
భారత్ అంటే నాణ్యమైన వస్తువుల అడ్డా నిరూపిద్దాం
ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ

స్వాతంత్ర్యం సాధించి పెట్టారన్నారు. జాతి ఒక్కటై స్వాతంత్య్ర సంగ్రామంలో నిలిచిందని, భారత స్వాతంత్య సంగ్రామం ప్రపంచానికి ఒక దీప శిఖవంటిదన్నారు. స్వాతంత్యం కోసం పోరాడుతున్న అనేక దేశాలకు ప్రేరణగా నిలిచిందని చెప్పారు. విస్తరణ వాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచానికి భారత్ కొత్త దారి చూపిందన్నారు. ప్రపంచమంతా భారత్ చూపిన బాటలో నడిచి కొత్త ప్రపంచానికి నాంది పలికాయన్నారు. స్వాతంత్య్ర సంగ్రామ నిరంతర ప్రేరణతో దేశం ముందుకు సాగుతోందని, ఆత్మనిర్భర్ భారత్ పేరుతో దేశం మరో ముందడుగు వేసేందుకు సిద్ధమైందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశం ఒక్కటై నిలబడిందన్నారు.

కొత్తదారులు వెతుక్కుందాం

కరోనా కష్టకాలంలోనూ మనం కొత్తదారులు వెతుక్కుందామన్నారు. పీపీఈ కిట్లు, ఎన్95 మాస్కులు కూడా వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండేదని, నాలుగు నెలల్లో స్వయం సమృద్ధి సాధించి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఓకల్ ఫర్ లోకల్ మాటను నిలబెట్టుకుందామని ప్రధాని పిలుపునిచ్చారు. మన ఉత్పత్తులను మనం గౌరవించకపోతే ప్రపంచం ఎలా గౌరవిస్తుందని, మన అనందరం మన ఉత్పత్తులకు మన ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిద్దామనన్నారు. మన యువతకు కొత్త అవకాశాలు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని, ఆహార ఉత్పత్తి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో కొత్త అవకాశాలకు యత్నాలు చేస్తున్నట్లు మోదీ తెలిపారు. వ్యవసాయం నుంచి బ్యాంకింగ్ వరకు అన్ని రంగాల్లో సంస్కరణలు ప్రారంభించామన్నారు. అనేక సంకటాలు ఎదుర్కొన్న దేశం ఆత్మవిశ్వాసంతో ముందుకెళుందన్నారు. ఎఫ్‌డీఐ ల్లో గతేడాది 18 శాతం వృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా వందకుపైగా వస్తువులపై దిగుమతిపై నిషేధం విధించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లో రవాణా హెలీక్యాప్టర్ల నుంచి రైఫిళ్ల వరకు సొంతంగా తయారు చేయనున్నట్లు ప్రకటించారు. హిమాలయాల నుంచి సముద్ర తీరం వరకు ఏ ఆపద వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణం వేగవంతం చేశామన్నారు.

పునరుత్పాదకతలో ఐదోస్థానం

పునరుత్పాదక ఇంధన వనరుల విషయంలో భారత్ ఐదోస్థానంలో నిలిచిందన్నారు. 100 నగరాల్లో కాలుష్యం తగ్గించే చర్యలు చేపట్టామని మోదీ తెలిపారు. సముద్ర తీరంలోని 1300 ద్వీపాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చెన్నై నుంచి సముద్ర అంతర్భాగ ఆప్టికల్ ÷బైర్ గ్రిడ్ నిర్మాణం ప్రారంభించామన్నారు. ఢిల్లీ, చెన్నై మాదిరిగానే అండమాన్‌లోనూ ఇంటర్నెట్ సౌకర్యం ఉంటుందన్నారు. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో ఎన్‌సీసీ కెడెట్లను తయారు చేస్తామన్నారు. వారిని నావికాదళం పర్యవేక్షిస్తుందని చెప్పారు. భూ సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో ఎన్‌సీసీ కెట్లను సైన్యం పర్యవేక్షిస్తుందని

వివరించారు. భారత్ ప్రపంచంలో ఎవరికన్నా తక్కువ కాదని, ప్రపంచ స్థాయి ఉత్పత్తులకు కేంద్రంగా మారనుందన్నారు. ఉత్తమ ఉత్పత్తుల దేశంగా ఎదుగుతోందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ మాటల్లో కాదు చేతల్లో చేసి చూపాల్సిన సమయం ఆసన్నమైందని ప్రధాని స్పష్టం చేశారు. మనందరం లోకల్ కోసం వోకల్‌గా మారాలని పిలుపునిచ్చారు. మన ఉత్పత్తులకు తగిన మార్కెట్‌ను మనమే సృష్టించుకోవాలన్నారు. మన వస్తువలకు మనం గౌరవం ఇస్తేనే ప్రపంచం గౌరవం ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా మోదీ అయోధ్య రామమందిర నిర్మాణానికి కూడా ప్రస్తావనకు తీసుకువచ్చారు. రామమందిర నిర్మాణాన్ని జాతియావత్తు సుహృద్భావంతో ఆహ్వానించిందన్నారు. జాతిజనుల మధ్య సయోధ్యకు ఇది గొప్ప తార్కాణమని, సుహృద్భావ జీవనంపై భారత్ ప్రపంచానికి చూపిన మార్గదర్శకమిదన్నారు.

కాశ్మీర్‌లో సరికొత్త అభివృద్ధి

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి ప్రారంభమైంది ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఎర్రకోటపై ఆయన మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్‌లో మహిళలకు, ఎస్సీలకు తొలిసారి హక్కులు లభించాయన్నారు. అలాగే లడఖ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. సిక్కిం తరహాలో లడఖ్, లేహ్, కార్గిల్‌ను సంపూర్ణ సేంద్రియ ప్రాంతాలుగా మారుస్తామన్నారు. లడఖ్ నుంచి నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు రోడ్ల నిర్మాణం వేగవంతం చేస్తామని ప్రకటించారు. సరిహద్దులు దాటేవారికి ఒకటే సమాధామని, సరిహద్దులు దాటే ప్రయత్నం చేసే వారికి మన సైన్యం గుణపాఠం నేర్పిందన్నారు. ఇకపై లడఖ్‌లో జరిగిన గుణపాఠమే ఎదురవుతుందని ప్రధాని హెచ్చరించారు. లడఖ్‌లో ఏం జరిగిందో ప్రపంచం చూసిందని, విస్తరణవాదం, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడి భారత్ పోరాడుతుందన్నారు. భారత్ పోరాటానికి ప్రపంచం అండగా నిలబడడమే మన నైతికతకు నిదర్శనమన్నారు.

బలమైన భారత్ నిర్మాణమే లక్ష్యం

బలమైన భారత్ నిర్మాణమే మన ముందున్న కర్తవ్యమన్నారు. పొరుగు దేశాలతో సుహృద్భావ సంబంధాలను కోరుకుంటున్నామని మోదీ స్పష్టం చేశారు. పరస్పర విశ్వాసం, గౌరవంతోనే సంబంధాలు ఉండాలని కోరుకుంటుందని చెప్పారు. భూమి, సముద్రం సరిహద్దులు కలిగిన అన్ని దేశాలతోనూ సత్సంబంధాలు కోరుకుంటున్నామన్నారు. పొరుగు దేశాలతో కలిసి పని

(-మిగతా 4వ పేజీలో..)

ఆత్మనిర్భరభారత్ లక్ష్యం సాకారం కావాలి

నేటినిజం
ఆదివారం 16-8-2020

స్వాంతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఎర్రకోట వేదికగా అనేక విషయాలు ప్రకటించారు. గతాన్ని స్పృశిస్తూనే వర్తమానాన్ని వివరిస్తూ భవిష్యత్ దార్శనికతను ప్రకటించారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంలో ముందుకు సాగేలా చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. ఇందుకు ఆత్మస్థయిర్యంతో నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు ప్రధాని మోడీ మరింత కఠినంగా భారత్ స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రయాణం సాగించాలి. ఇకపోతే ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్(ఎన్‌డీహెచ్‌ఎం)ను ప్రారంభించారు. దీని కింద ప్రతి భారతీయుడికి ఒక ఐడీ నంబర్‌ను కేటాయించనున్నారు. పూర్తిగా టెక్నాలజీ ఆధారితమైన ఈ మిషన్ వైద్యరంగంలో విప్లవాత్మక మైన మార్పులకు దోహదం చేస్తుందని ఆయన తెలిపారు. ప్రతి భారతీయుడి సమగ్ర వైద్యసమాచారం ఆ ఐడీ ద్వారా లభిస్తుందని వెల్లడించారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఐడీ కార్డు లభిస్తుంది. వైద్యుడు లేదా ఫార్మసీకి వెళ్లిన ప్రతిసారి జాతీయ స్థాయిలో ఆ సమాచారం మొత్తం కార్డులో నిక్షిప్తమవుతుందని మోదీ వెల్లడించారు. ఇది దేశంలో ఆరోగ్య సేవల సామర్థ్యం, పనితీరు, పారదర్శకతను గణనీయంగా మెరుగు పరుస్తుందని భావిస్తున్నారు. అయితే తెలంగాణ సిఎం గతంలోనే ఈ ప్రకటన చేశారు. అందరి హెల్త్ ప్రొఫైల్ రికార్డు చేస్తామని అన్నారు. దీనిద్వారా వ్యక్తి ఆరోగ్య వివరాలను అందులో పొందుపర్చడం ద్వారా ఇక ముందు ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు వచ్చినా త్వరగా తెలుసుకుని చికిత్స అందించే వీలు కలుగుతుంది. అయితే జాతీయస్థాయిలో దీనిని తీసుకుని రావాలన్న ఆలోచన మంచిదే. దీంతో పాటు దేశంలో కార్పోరేట్ ఆస్పత్రుల దాష్టీకం పెరుగుతున్నందున ప్రభుత్వ పరంగా వైద్యశాలలను పటిష్టం చేయాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కడమే గాకుండా ప్రజలకు కూడా వైద్యం అందనుంది. ప్రభుత్వ ఆస్పత్రులను పటిష్టం చేసేలా నిధులను విడుదల చేయడం, కార్పోరేట్ కంపెనీలు సహకారాం అందించేలా చేయడం ద్వారా ఆస్పత్రులను బలోపేతం చేయవచ్చు. అలాగే సమాచారం దుర్వినియోగం కాకుండా చూసేందుకు సంబంధిత వ్యక్తుల ఆరోగ్య వివరాలను వైద్యులు, హెల్త్ ప్రొవైడర్లు ఒకసారి మాత్రమే పొందే అవకాశం ఉందన్నారు. దీనికింద మారుమూల ప్రాంతాలకు కూడా టెలీ మెడిసిన్, ఈ- ఫార్మసీలు సేవలు అందనున్నాయి. అలాగే ఇతర ఆరోగ్య సంబంధ ప్రయోజనాలు పొందడానికి వీలు కలగనుంది. ఇకపోతే దేశంలో కరోనావైరస్ మహమ్మారి విలయ తాండవం కారణంగా టెలీ మెడిసిన్, డిజిటల్ వైద్య సేవలకు ప్రాముఖ్యత ఏర్పడింది. కరోనా వైరస్ నివారణకు సంబంధించి మూడు వ్యాక్సిన్లు వివిధ దశల పరీక్షల్లో ఉన్నాయని, శాస్త్రవేత్తలు ఆమోదం, అనుమతి లభించి వెంటనే ప్రతి భారతీయుడికి లభించేలా ఉత్పత్తి, పంపిణీ ప్రణాళికతో ఉన్నామనీ, దానికోసం రోడ్‌మ్యాప్ సిద్ధంగా ఉందని ప్రధాని ప్రకటించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పనిచేస్తున్న వారియర్స్‌కు శిరస్సు వంచి సలాం చేస్తున్నానంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ దేశ ప్రజలకు ఈ శుభవార్త అందించారు. దేశానికి సేవ చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన ఆరోగ్య కార్యకర్తలు, వైద్యులు, నర్సులు ,ఇతర కరోనా యోధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఒక విపత్కర సమయంలో ఉన్నాం. ఈ మహమ్మారి కారణంగా తాను పిల్లలను ఎర్రకోటవద్ద చూడలేకపోతున్నానని పేర్కొన్నారు. ఈ సంక్షోభానికి చాలా కుటుంబాలు ప్రభావితం అయ్యాయి, చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అయితే 130 కోట్ల మంది భారతీయుల సంకల్పంతో, ఈ మహమ్మారిని ఓడిస్తామని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాని మోడీ వరుసగా ఆరేళ్లుగా ఎర్రకోటపై నుంచి జాతీయపతాకాన్ని ఎగురేస్తున్నారు. ఇదే సందర్భంలో దేశం ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. వాటిని స్థూలంగా అయినా స్పృశించి ఉంటే బాగుండేది. మోడీకి ఆరేళ్ల సమయం తక్కువేం కాదు. అనేక సమస్యలను పరిష్కరించి ఉండవచ్చు. కానీ సమయం వేగంగా ముందుకు సాగుతున్న వేళ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూనే కరోనా లాంటి విపత్కర పరిస్థి తుల్లో నిలదొక్కుకునేలా బలోపేతం చేయాల్సింది. ఇప్పటికైనా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసి, వైద్యశాలలను పెంచి, ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ఇకపోతే దేశవ్యాప్తంగా భారీవర్షాలు,వరదలు అతలాకుతలం చేస్తున్న సమయంలో సహాయక చర్యలు అందక అనేకులు ఇక్కట్లు పడుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో నష్టం విపరీతంగా ఉంది. సాయం కోసం మళ్లీకేంద్రం వైపు చూడాల్సిన ఆగత్యం ఏర్పడింది. దేశస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అనేకులు నీటిలోనే గడపాల్సిన దుర్గతి పట్టింది. ఇలాంటి దుస్థితి పోయేలా దేశాన్ని విపత్తు నిర్వహణా రంగంలో కూడా పటిష్టం చేసుకోవాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా వరదలు ముంచెత్తాయి. మహారాష్ట్ర,కర్నాటక, కేరళ రాష్ట్రాలు ఇంకా భారీ వర్షాలతో అల్లాడుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో భారీగా వరదలు వచ్చి పడ్డాయి. అనేక భవనాలు, రోడ్లు ధ్వంసం అయ్యాయి. కళ్లముందే భవనాలు, కొండచరియలు విరిగిపడ్డాయి. ఇక కేరళ,మహారాష్ట్ర, కర్నాటకలోనూ ఇంకా పరిస్థితి కుదుటపడలేదు. ఆర్మీలో విపత్తు నిర్వహణకు ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి వారికి తర్ఫీదు ఇస్తే మంచిది. ఇకపోతే దేశంలో కరోనా విసిరిన సవాళ్లను గమనించి వివిధ రంగాల్లో భారత్ ఎలా ముందుకు సాగాలో ప్రధాని మోడీ గుర్తించి ఆ తరహా చర్యలకు ఉపక్రమించాలి. ప్రధానంగా ఆర్థికంగా చితికిపోతున్నా వారిని ఆదుకునేందుకు బ్యాంకింగ్ వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాలి. వేలకోట్లు ఎగ్గొట్టే వారిపట్ల ఉదారంగా ఉంటున్న బ్యాంకులు.. సామాన్యులు లక్షలోపు రుణాలు కట్టలేకపోతే ఇళ్లను తాకట్టుపెట్టేస్థాయికి వస్తున్నారు. ఈ దశలో స్వయం సమృద్ధిని ప్రోత్సహించే పథకాలను విరివిగా ప్రకటించాలి. బ్యాంకులు ఉదారంగా ఉండేలా చూడాలి. విద్యావైద్య రంగాలను పటిష్టం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు చేయాలి. అప్పుడు ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు పెరగుతాయి. ప్రైవేట్ దోపిడీ తగ్గి ప్రజల ఆర్థిక స్థితిగతులు కూడా మెరుగుపడుతాయి. ఈ సంకల్పంతో ప్రభుత్వాలు సాగితే దేశం స్వయం సమృద్ధిలో ముందుకు సాగగలదు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ పాలకులకు ఇది సంకల్పంగా మారితే దేశ దిశ మారుతుంది.

చైనా పేరెత్తడానికి భయమా?

-ప్రధాని ప్రసంగంపై సూర్జేవాలా ఎద్దేవా

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): అధికారంలో ఉన్న వారు చైనా పేరెత్తడానికి జంకుతున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ప్రధాని మోడీపై పరోక్షంగా విమర్శల దాడి చేశారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ ప్రసంగం ముగియగానే ప్రధానిపై కాంగ్రెస్ విరుచుకుపడింది. భారత సార్వభౌమత్వాన్ని సవాల్ చేసే వారికి ఎల్ఓసీ మొదలు ఎల్ఏసీ వరకూ సైన్యం దీటైన జవాబిచ్చిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. అయితే... చైనా పేరును మాత్రం మోదీ ప్రస్తావించలేదు. చైనా పేరును ఎత్తడానికి అధికార పక్షం భయపడుతోందని కాంగ్రెస్ విరుచుకుపడింది. కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు 130 కోట్ల మంది భారతీయులకు మన సైన్యంపై పూర్తి విశ్వాసముంది. చైనాకు దీటైన జవాబిచ్చిన సైన్యానికి మేము సెల్యూట్ చేస్తున్నాం. కానీ అధికార పక్షంలో ఉన్న వారి సంగతేంటి? చైనా పేరెత్తడానికే వారెందుకు జంతుకుతున్నారని సూర్జేవాలా సూటిగా ప్రశ్నించారు. భారత భూభాగంలోకి చైనా ప్రవేశించినపుడే ఎప్పుడు ప్రవేశించింది.. వెనక్కి పంపడానికి సర్కార్ తీసుకున్న చర్యలేంటని ప్రజలు నిలదీయాల్సి ఉందిందని ఆయన అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు కూడా ఇలా ప్రశ్నించడమే నిజమైన ప్రజాస్వామ్యమని సూర్జేవాలా అన్నారు.

చిన్నప్పటి నుంచే నాన్నకు జెండా ఎగురేయడం అలవాటు

-జ్ఞాపకాలు నెమరేసుకున్న ప్రణబ్ తనయ షర్మిష్ఠ

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కూతురు షర్మిష్ఠ కొన్ని అనుభవాలను ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు కచ్చితంగా తన తండ్రి జాతీయ జెండాను ఎగురవేసేవారని గుర్తు చేసుకున్నారు. దీంతో పాటు స్వాతంత్ర్య దినోత్సవపు పాత ఫొటోలను ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మా ఊళ్లో మా నాన్న, మా మామయ్య బాల్యం నుంచే జెండాలు ఎగురవేసేవారు. అప్పటి నుంచి... స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేయడం మా నాన్న ఎప్పుడూ మానలేదు. కొనసాగుతూనే వస్తోంది. మా ఇంట్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఫొటోలను పోస్ట్ చేశా, వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి కచ్చితంగా మా నాన్న జెండాను ఎగురవేస్తారు. జై హింద్' అని షర్మిష్ఠ ట్విట్టర్ వేదికగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్యం క్షీణించడంతో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే శుక్రవారం వరకూ ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదని డాక్టర్లు తెలిపారు. ఆయన ఐసీయూలోనే ఉన్నారని, వెంటిలేటర్ సాయంతో చికిత్స అందుతోందని వైద్యులు తెలిపారు.

పాలమూరులో జెండా ఎగురేసిన మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం నూతన అంబులెన్స్ ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో

జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నొస్టిక్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నిన్న మధ్యాహ్నం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. అంబులెన్స్ ల కొరత ఉందని మంత్రి దృష్టికి ఆస్పత్రి వైద్య సిబ్బంది తీసుకొచ్చారు. ఈ క్రమంలో నూతన అంబులెన్స్‌ను మంత్రి అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఇంకా విషమంగానే ప్రణబ్ ఆరోగ్యం

చికిత్స అందిస్తున్నామన్న ఆర్మీ డాక్టర్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని ఇంటెన్సివ్ కేర్‌లో వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స అందిస్తున్నామని, ఆయన పరిస్థితి ఇంకా మెరుగుపడలేదని ఢిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రెఫరల్ హాస్పిటల్ వైద్య నిపుణుల బృందం శనివారం తెలిపింది. 'ప్రణబ్ జీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. ఆయనను ఇంటెన్సివ్ కేర్‌లో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నాం. ఆయన ప్రాణాధారాలు స్థిరంగా ఉన్నాయి. నిష్ణాత వైద్య బృందం ఆయనను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోంది' అని

హాస్పిటల్ ప్రకటన విడుదల చేసింది. శుక్రవారం ప్రణబ్ కుమార్తె షర్మిష్ఠ ముఖర్జీ తన తండ్రి ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉందని, కాంతికి ఆయన కండ్లు కొంత ప్రతిస్పందిస్తున్నాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రణబ్ మృతి చెందారని వస్తున్న వార్తలను ఆమె ఖండించిన విషయం తెలిసిందే. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ప్రణబ్ ముఖర్జీ(84) అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం ఢిల్లీ కాంట్‌లోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రెఫరల్ ఆసుపత్రిలో చేరారు. తరువాత ఆయనకు పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

తెలంగాణలో రజాకార్ల రాజ్యం

గడీల పాలనను తరిమి కొట్టాలి

బిజెపి కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన బండి సంజయ్

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): తెలంగాణలో రజాకార్ల రాజ్యం నడుస్తోందిన, గడీల పాలనకు చరమగీతం పాడాల్సి ఉందిన బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కుటుంబ పాలన, గడీల పాలన సాగుతోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పెద్దిరెడ్డి , పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజసింగ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో రజాకార్ల పాలన సాగుతోందన్నారు.ప్రగతి భవన్, ఫామ్ హౌస్ నుంచి పాలనను అంతమెందించాలన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా జరపాలన్నారు. కేసీఆర్ కుటుంబ చరిత్ర కోసమే.. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజులను కట్టడి చేసే దమ్ము కేసీఆర్‌కు లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.మంచి జరిగితే కేసీఆర్ ఖాతాలో.. చెడు జరిగితే కేంద్రంపై నెపం వేస్తున్నాడని విమర్శించారు.

ఎన్డీఆర్ఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలి

విపత్తు సమయాల్లో పటిష్ట వ్యవస్థతోనే సాధ్యం

వరదలు, ప్రమాదాల్లో చురకుగా పాల్గొనేలా చూడాలి

న్యూఢి ల్లీ,ఆగస్ట్ 15(ఆర్ఎన్ఎ): విపత్తులను ఎదుర్కో వడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్థితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారుచేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచనలు చేసి ఆచరణకు సిద్ధపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహాయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళలో గతవారం రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం,అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. కేరళలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణ మైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది.

వ్యాక్సిన్‌లపై విస్తృత ప్రచారం సాగాలి

ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేలా చేయాలి

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ఇతరత్రా వ్యాక్సిన్‌లపై నిర్లక్ష్యం చూపకుండా ప్రభుత్వం ప్రజలను చైతన్యం చేయాల్సి ఉంది. పిల్లలకు వివిధ రకాల వ్యాక్సిన్ల విషయంలో ఈ మధ్య కాలంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది

. కరోనా బూచి చూపి ఎవరు కూడా ఆస్పత్రులకు వెళ్లలేక పోతున్నారు. అలాంటి వారిని గుర్తించి ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్‌లు వేసే ప్రయత్నం చేయాలి. అలాగే వర్షాకాలం కావడంతో వివిధ రకాల అంటురోగాలు ప్రబలకుండా కూడా ప్రజలను చైతన్యం చేయాలి.ఇందుకోసం గ్రామాల్లో దండోరా వేయిస్తే మరీమంచిది. ఇందులో భాగంగా వ్యాధి నిరోధక టీకాలైన మిజిల్స్, రుబెల్లా తదితర వ్యాక్సిన్‌ల ద్వారా వ్యాధినివారణకు ప్రభుత్వం నడుం బిగించాలి. నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు మిజిల్స్, రుబెల్లా, తట్టు టీకాలను వేయించవచ్చని వైద్యాధికారులు తెలిపారు.

గతంలో వేయించిన పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో అదనపు డోసును వేయించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేశారు. అన్ని పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా దవాఖానలు, ప్రసూతి కేంద్రాల్లో ఉచితంగా ఈ టీకాలను వేస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు వివిధ జిల్లాలకు చెందిన వైద్యాధి కారులు విస్తృత ప్రచారం చేయాలన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల వైద్యయంత్రాంగం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలతో పాటు జిల్లా వైద్యాధికారులు వ్యాక్సినేషన్ పై ప్రచారం జరపడం మంచిది. జిల్లాల్లోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, బస్తీల్లో పోస్టర్లు, కరపత్రాలతో పాటు అవగాహన సదస్సుల ద్వారా టీకాలపై ప్రచారం, అవగాహన కల్పించాలి. వ్యాధులు వచ్చిన తరువాత దవాఖానలకు పరుగెత్తడం కంటే రోగాలు రాకుండా ముందుజాగ్రత్త పడడమే ఉత్తమమం. అందుకోసం వ్యాధినిరోధక శక్తిని పెంచే టీకాలు వేయించాలని వైద్యులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మిజిల్స్, రుబెల్లా టీకాలు వేయడం వల్ల వ్యాధులు రాకుండా ఉంటుందని పలు అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చెప్పాలి. కరోనా నేపథ్యంలో వ్యాధులు రాకుండా ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుకోవడం, ఒక వేళ రోగాలు వ్యాపిస్తే వాటిని ప్రారంభదశలోనే గుర్తించి, సరైన చికిత్స చేయడం తదితర వాటిపై వైద్యాధి కారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఈ టీకాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, వాటిపై ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోనవ సరంలేదని వైద్యాధికారులు స్పష్టం చేశారు. గతంలో వేయించుకున్నవారు మళ్లీ వేయించుకోవచ్చని సూచిస్తున్నారు.

తెలంగాణ ఆవిర్భావంతో పల్లెల్లో ప్రగతి

ఇతరరాష్ట్రాలకు ఆదర్శంగా అభివృద్ధి పథకాలు

జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఆవిర్భావంతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ ప్రగతిని చూసి అనేక రాష్ట్రాలు ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలను కాపీ కొడుతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల రూపు రేఖలే మారిపోయాయన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో మంచినీటిని, విద్యుత్‌ను సరఫరా చేయడమే కష్టంగా మారేదని, సర్పంచ్‌ల ఐదేండ్ల కాలం వీటికే సరిపోయేదన్నారు. కానీ, నేటి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందన్నారు. అన్ని గ్రామాల్లో అనేక విధాలుగా అభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు.

గ్రామాల్లో 24 గంటలపాటు విద్యుత్ సరఫరా, ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా ఆరోగ్యకరమైన, శుద్ధి చేసిన మంచినీరు అందుతుందన్నారు. పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.339 కోట్లు విడుదల చేయడం దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ఎన్నడూ లేని విధంగా కరోనా కష్ట కాలంలో రైతాంగాన్ని ఆదుకుని రూ.30వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేసిన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్సేనన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ తోపాటు రుణ మాఫీలు, రైతాంగానికి పంటల పెట్టుబడులు కూడా ఇస్తున్నామని వివరించారు. కరోనా మహమ్మారి కారణంగా వేడకలు నిరాడంబరంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ స్వాతంత్య దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

తమిళనాట మరో117 మంది మృతి

చెన్నై,ఆగస్ట్ 15(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కరోనా వైరస్ వ్యాప్తి తీవ్రత కొనసాగుతున్నది. గురువారం నుంచి శుక్రవారం వరకు గత 24 గంటల్లో కొత్తగా 5,890 పాజిటివ్ కేసులు, 117 మరణాలు నమోదయ్యాయి. దీంతో ఆ రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 3,26,245కు, మరణాల సంఖ్య 5,514కు చేరింది.

కాగా, గత 24 గంటల్లో 5,556 మంది కరోనా రోగులు కోలుకుని దవాఖానల నుంచి డిశ్చార్జ్ అయినట్లు తమిళనాడు ఆరోగ్యశాఖ తెలిపింది. ప్రస్తుతం 53,716 యాక్టివ్ కేసులు ఉన్నట్లు పేర్కొంది.

తెలంగాణలో ప్రజాస్వామ్యానికి ముప్పు

కుటంబ

చలివాగు నుంచి బయటపడ్డ12 మంది రైతులు

హెలికాప్టర్‌ను రంగంలోకి దించడంతో క్షేమంగా బయటకు

జయశంకర్ భూపాలపల్లి,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి వద్ద చలివాగులో చిక్కుకున్న 12 మంది రైతులను రెస్క్యూ బృందం రక్షించారు. రెస్క్యూ హెలికాప్టర్ ద్వారా ఒడ్డుకు చేర్చారు. ఘటనపై స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ఎంపీపీ మల్లారెడ్డి ఫోన్‌లో సమాచారం అందించారు. రైతులను రక్షించాలంటూ ఆయన తక్షణమే మంత్రి కేటీఆర్‌కు ఫోన్‌లో వివరాలు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్.. ఘటనాస్థలికి హెలికాప్టర్ పంపాలని సీఎస్‌తో మాట్లాడారు. తక్షణమే హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ బృందాలు ప్రయత్నాలు చేపట్టాయి. ఎమ్మెల్యే గండ్ర వెంకట

రమణారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. రైతులు క్షేమంగా ఒడ్డుకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం వ్యవసాయ మోటర్లు తెచ్చుకునేందుకు వెళ్లిన రైతులు వాగులో చిక్కుకోవడంతో తక్షణం స్పందించిన మంత్రి కేటీఆర్ రెండు హెలిక్యాప్టర్లు పంపించారు. వారిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వారు క్షేమంగా రావడంతో కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మంత్రి ఎర్రవబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కాగా, మంత్రి కేటీఆర్‌కు రైతుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెప రెపలాడిన జాతీయ పతాకం..!!

-సంగారెడ్డి జిల్లా సామూహిక కాలెక్టరేట్ లో జాతీయ పతాకం ఆవిష్కరించిన రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ అలీ.

సంగారెడ్డి ఆగస్టు 15 (నేటినిజం ప్రతినిధి) స్వాతంత్రం ఫలాలు అందరికీ అందుతున్నాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ అలీ అన్నారు.

శనివారం కలెక్టరేట్లో నిర్వహించిన 74 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పోలీస్ వందన సమర్పణ స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా జరుపుకుంటున్నామన్నారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా మనకు స్వాతంత్రం సిద్ధించిందన్నారు. కరొనా వైరస్ పై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కరొనా వైరస్ కు భయపడాల్సిన పని లేదని జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కరోనాకు నిర్లక్ష్యం, భయం తో సకాలంలో చికిత్స తీసుకోకపోవడంతో ప్రాణాంతకం అవుతుందన్నారు.

ప్రభుత్వం కరోనా విషయంలో ప్రజలకు అన్నివిధాల అండగా ఉందన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైనన్ని మందులను అందుబాటులో ఉంచి చికిత్స లు అందిస్తున్నట్లు తెలిపారు.

ఇప్పటివరకు రాష్ట్ర రాజధాని హైదరాబాదు లోనే విజృంభించిన వైరస్ అక్కడ ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పట్టగా, జిల్లాలలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, దానిని నియంత్రించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

జిల్లాలో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రోగుల కోసం 100 పడకలు, ఎమ్మెన్నార్ వైద్య కళాశాలలో వంద పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు . జిల్లాలో అన్ని పీహెచ్సీలు ,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో రాపిడ్ టెస్ట్ కిట్స్, పి పి ఈ కిట్స్, హోమ్ క్వారంటైన్ కిట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందరూ అన్ని వేళలఅప్రమత్తంగా ,జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

రైతులకు సంబంధించిన ఏ పనిముట్టు , పరికరాలైనా అందరికీ ఉపయోగంలోకి, అందుబాటులోకి వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. యువ రైతులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని విధాల సహకారాన్ని అందిపుచ్చుకొని తమ ఆలోచనలతో రాణించాలని ఆయన సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని , యువత అటువైపు దృష్టి సారించాలన్నారు. ఆవిష్కర్తలకు అన్ని విధాల ప్రోత్సహిస్తామన్నారు.

అనంతరం జిల్లా నుండి ఎంపికైన ఆవిష్కరణల పనితీరును ఆయన పరిశీలించారు. ఆవిష్కర్తలు సంగమేశ్వర్, విగ్నేశ్వ ర్ లను అభినందించి సన్మానించారు. వీల్ బేస్డ్ ఫెర్టిలైజర్ స్ప్రే పంపు ఆవిష్కర్త సంగమేశ్వర్ కు డీ సి ఎం ఎస్ చైర్మన్ శివ కుమార్ 11 వేల రూపాయల చెక్కును ప్రోత్సాహకంగా అందించారు.

ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు ,జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ, అదనపు కలెక్టర్లు రాజర్షి షా ,వీరారెడ్డి ,మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి , వైస్ చైర్ పర్సన్ లతా విజయేందర్ రెడ్డి, డి ఆర్ వో రాధిక రమణి, జిల్లా అధికారులు ,ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

స్వాతంత్ర్య వేడుకల్లో అటవీసంరక్షణాధికారి శోభ

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): ప్రతి ఒక్కరూ అడవులు, పర్యావరణ పరిరక్షణకు పునరంకితం కావాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర.శోభ అన్నారు. అదే సమయంలో ఎవరి పరిధిలో వారు మిగితా వారిని చైతన్యం చేయాలన్నారు. రాజ్యాంగంలో కూడా అడవులు,పర్యావరణ రక్షణను పౌరుల విధుల్లో చేర్చిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.

ఇన్నేళ్ల స్వాతంత్ర్య దినోత్సవఫలాలుగా మనం అభివృద్ధిని, సంక్షేమాన్ని పొందామని, ఇప్పుడు మాత్రం కరోనా మానవ అస్థిత్వానికే సవాల్ విసురుతోందని అన్నారు. అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతకుమారితో కలిసి అరణ్యభవన్‌లో ఆమె స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ అధికారులు, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. పరిసరాలు, పర్యావరణం చక్కగాకాపాడుకున్నపప్పుడే సాధించిన,

అనుభవిస్తున్న స్వాతంత్ర్యానికి సార్థకత ఉంటుందని తెలిపపారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరుతో అడవులు, పర్యావరణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. జంగిల్‌బచావో,..జంగల్ బడావో...నినాదం కూడా తీసుకుందని అన్నారు. ఇదేస్ఫూర్తితో అటవీ అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఎగిరిన మువ్వన్నెల జెండా

పతాకావిష్కరణ చేసిన మంత్రులు శాసనసభలో స్పీకర్ జెండా ఆవిష్కరణ

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో 74వ స్వాతంత్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు జెండావిష్కరణ చేసి ప్రసంగించగా, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. కరోనా మహమ్మారి కారణంగా చాలా తక్కువ మంది అతిథులు ఈ వేడుకలకు హాజరు కాగా, వర్షం కారణంగా వేడకలకు అంతరాయం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర శాసనసభ కార్యాలయ ఆవరణలో శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు భారతదేశ పౌరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. వరంగల్ కలెక్టరేట్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జెండా ఆవిష్కరించి వందనం చేశారు. ఆయన వెంట ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యే అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హరిత, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు హాజరయ్యారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సత్యవతి రాథోడ్ జెండా ఎగుర వేసి వందనం చేశారు. సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్ర, దేశ పౌరులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందున్నాం: కెటిఆర్

సిరిసిల్లలో స్వాతంత్య దినోత్సవం సందర్భంగా శనివారం ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. తెలంగాణ నేడు రైతు రాజ్యంగా బాసిల్లుతోందని, స్వతహాగా రైతు కావడం వల్లే కేసీఆర్ రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఎన్నడూ లేని విధంగా కరోనా కష్ట కాలంలో కూడా రూ.30వేల కోట్లతో ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. కరోనా కారణంగా స్వాతంత్య వేడుకలు నిరాడంబరంగా నిర్వహించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అంతకు ముందు కేటీఆర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతియ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో పాటు అన్ని శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ జెండా ఆవిష్కరించగా, నిజామాబాద్ కలెక్టరేట్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో హాజరై జెండా ఎగురవేశారు.

నిర్మల్‌లో జాతీయ పతాకావిష్కర చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌లో జెండా ఎగురేసిన ఇంద్ర

స్వాతంత్యం కోసం జాతికి అంకితమైన మహానీయుల ఆశయాల స్ఫూర్తితో స్వరాష్ట్రంలోనూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద వర్గాల ఆకాంక్షను నెరవేరుస్తున్నాయని, సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. 74వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మువ్వెన్నల జెండాను ఎగురవేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అథితిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గాంధీ పార్కులో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శాస్త్రినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కూడా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్, కె. విజయలక్ష్మి, కలెక్టర్ ముషారఫ్ ఫారూక్ అలీ, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తదితరలు పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జెండా ఆవిష్కరించి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, కలెక్టర్ రవి, అడిషనల్ కలెక్టర్ రాజేషం ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి కే తారకరామారావు

-లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
-శౌచశాలలు, ట్రాక్టర్ ల ప్రారంభం
-జిల్లా ఆసుపత్రి వైద్యుల కృషి అభినందనీయం

వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి):74 వ భారత స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర పురపాలక, ఐ.టీ. శాఖ మంత్రి కె. తారకరామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పతాక ఆవిష్కరణ చేశారు.

పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ముచ్చటించారు.

అనంతరం పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సహాయం అందించడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు రాష్ట్ర పురపాలక, ఐ.టీ., శాఖ మంత్రి కె. తారకరామారావు పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణంలో మొత్తం 332 మందికి ఈ చెక్కులు మంజూరు కాగా అందులో నుండి 10 మందికి కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మంత్రి పంపిణీ చేశారు.

పేదింటి ఆడబిడ్డల వివాహం కోసం ఆర్థిక సహాయానికి ఈ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని, ప్రభుత్వ పథకాలు చివరి గడప వరకు చేరే విధంగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పమని మంత్రి పేర్కొన్నారు.

అనంతరం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో చెత్త సేకరణ కోసం నూతనంగా 34 లక్షల 8 వేల రూపాయల ఖర్చు గల 6 ట్రాక్టర్ లను, 3 లక్షల 52 వేల ఖర్చు గల 5 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకర్లను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే విలీన గ్రామాల కోసం 6 లక్షల 55 వేల ఖర్చుతో ఏర్పాటు చేసిన 1000 చెత్త బుట్టలను మంత్రి పరిశీలించారు.

తదనంతరం పురపాలక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వక్కన ఏర్పాటు చేసిన శౌచశాలలను (పబ్లిక్ టాయిలెట్స్) మంత్రి ప్రారంభించారు. జనాభా ప్రాతపదికన పట్టణ ప్రజలకు, గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం వీటిని నిర్మించడం జరిగిందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి వెయ్యి జనాభాకు ఒక మరుగుదొడ్డి ఉండాలని కచ్చితమైన నిబంధనలు పెట్టిందని, ఇందులో భాగంగా సిరిసిల్ల పట్టణంలో ఉన్న జనాభాకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించడంలో పురపాలక శాఖ అధికారులు చురుకుగా పని చేశారని మంత్రి అభినందించారు.

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

కోవిడ్ బాధితులకు అండగా నిలుస్తూ, వివిధ కార్యక్రమాలను చేపడుతున్న అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని మంత్రి కె. తారకరామారావు పేర్కొన్నారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 50 లక్షల రూపాయలతో 200 హోమ్ ఐసోలేషన్ కిట్లను, ఫేస్ షీల్డ్, పీ.పీ.ఈ కిట్లను, సానిటైజర్ లను, జిల్లాలోని 40 గ్రామాలకు బాడీ ఫ్రీజర్ బాక్సులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు. కోవిడ్ బారిన పడ్డ వారికి అండగా నిలుస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. ఇలాగే ముందు ముందు కూడా మంచి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

జిల్లా ఆసుపత్రి వైద్యుల కృషి అభినందనీయం

జిల్లా ఆసుపత్రి వైద్యుల కృషి అభినందనీయమని మంత్రి అన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 80 ఏళ్ల వయసు గల మహిళ తనకు ఇప్పటికే దయాబెటిక్ ఉన్నప్పటికీ కూడా కరోనా ను జయించిందని, జిల్లా ఆసుపత్రి సిబ్బంది కృషి వల్లే ఆమె కోలుకుందని అన్నారు. రాష్ట్రంలో కరోనా బారిన పడి 72 శాతం మంది కోలుకున్నారని, ప్రభుత్వం కరోనా బాధితులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. వైద్యులను, వైద్య సిబ్బందిని గౌరవించాలని అన్నారు. జిల్లా ఆసుపత్రి వైద్య సిబ్బందిని మంత్రి అభినందిం చారు. వేడుకలలో టైస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జెడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ లు ఆర్ అంజయ్య, బి.సత్య ప్రసాద్, శిక్షణ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య రైతు సమన్వయ సమితి జిల్లా సమన్వయకర్త శ్రీ గడ్డనీ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జిందం కళ, మున్సిపల్ చైర్మన్ సమ్మయ్య, జిల్లా అధికారులు, లయన్స్ ప్రతినిధులు డా.శ్రీనివాస్ రెడ్డి, డా.విజయ, నాగుల సంతోష్, శివ ప్రసాద్, వెంకటేశ్వర్ రావు, శ్రీనివాస రావు, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో జెండా ఆవిస్కరించిన మంత్రి కెటిఆర్

గ్రామాల్లో ప్రజా చైతన్యంతో పారిశుద్ధ్యం

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): పంచాయితీల్లో పచ్చదనం పారిశుద్యం కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్న లక్ష్యం వేరకు వల్లెప్రగతి,పట్టణ ప్రగతి కార్యాక్రమాలు దోహదపడ్డాయి.ఇప్పటికే ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలతో గ్రామల్లో పారిశుద్య కార్యక్రమాలను చేపట్టారు. దీంతో పల్లెల్లో పరిశుద్యానికి ప్రాధాన్యం ఏర్పడింది. పారిశుద్యం, పచ్చదనం, తాగునీరు అందరి హక్కుగా ఉండాలని ముఖ్యమంత్రి సంకల్పం నెరవేరబోతుంది.

ప్రతీ పల్లె పచ్చగా ఉండేందుకు ప్రణాళిక సిద్దం చేసారు. ప్రతీ పల్లె పచ్చగా పారిశుధ్య లోపం లేకుండా ఉండాలని అందరికీ కనీస మౌలిక సదుపాయాలు అందాలని ప్రభుత్వ ఆలోచన త్వరలో కార్యరూపం దాల్చనుంది. ఇందుకు గానూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామసర్పంచ్‌లకు మార్గనిర్దేశనం చేశారు. దీంతో గ్రామాల్లో శ్రమదానాలు చేపట్టారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులకు దిశా నిర్దేశం చేయడంతో వరుస కార్యక్రమాల ద్వారా గ్రామాలను స్వచ్ఛత వైపు మళ్లించారు.. దీంతో కొత్త పాత పంచాయతీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంత్రి ఆదేశాలు రావడంతో పల్లెల్లో శ్రమదానాలకు యువత ముందుకు వచ్చింది. పలు గ్రామాల్లో అధికారులు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఇక నుంచి పచ్చగా ఉండాలని పారిశుధ్యం మెరుగుపడేలా అధికారులు ప్రత్యేక కృషి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నది. నిత్యం పారిశుధ్యం పనులు చేసే కార్మికులు ఏనాటి నుండో చాలీచాలని జీతాలతో గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న వారి జీవితాల్లో మార్పులు తీసుకు రావడంతో పాటు వారి వేతనాలు పెంచే కార్యక్రమం చేపట్టింది. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యమివ్వాలనే ఉద్దేశంతో పారిశుధ్య కార్మికులను ప్రతీ గ్రామపంచాయతీలో ఉండాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు కూడా పారిశుధ్యకార్మికులను నియమించుకునే అవకాశాలున్నాయి. జిల్లాలో ఇప్పటికే మేజర్ గ్రామపంచాయతీల్లో 900మందికి పైగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు కేవలం మేజర్ గ్రామ పంచాయతీలో ఉండగా, తాజాగా నియమించే పారిశుధ్య కార్మికులు ఇక నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో ఉండనున్నారు. అన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రతీ పల్లె చక్కటి వాతావరణంలో ఉండాలని, తాగునీరు, పచ్చదనం, పారిశుధ్యం అందరి హక్కుగా ఉండాలని నిర్ణయించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు మెరుగు పడేందుకు పారిశుధ్య కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేసింది. ఇందుకోసం వారి వేతనాలు కనీసం రూ.8500 ఉండాలని నిర్ణయించారు. జీపీల్లో పని చేసే కార్మికుడికి ఈ వేతనం వర్తింప జేయాలని ఆదేశాలు కూడా అధికారులకు అందాయి. గ్రామంలో మొక్కలు పెంచేలా గ్రామస్తులను అవగాహన కల్పించారు. మొత్తంగా ఇటీవల వరుసగా చేపట్టిన కార్యాక్రమాలతో గ్రామాల్లో పరిస్థితులు మారాయి. ప్రజల్లో కూడా పారిశుద్యం, పచ్చదనంపై ప్రజల్లో చైతన్యం కానవస్తోంది.

దారుస్సలాం పై మువ్వన్నెల జెండా రెపరెపలు

ఎంఐఎం కార్యాలయంలో 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి):ఎందరో అమరుల, వీరుల త్యాగ ఫలాలతో దేశానికి స్వాతంత్ర్యం సిద్దించిందని మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్బాస్ సమి అన్నారు. శనివారం నగరంలోని ఎంఐఎం పార్టీ జిల్లా కార్యాలయం దారుస్సలాంలో 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అబ్బాస్ సమి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్పొరేటర్లు, కార్యకర్తలతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈసందర్భంగా అబ్బాస్ సమి మాట్లాడుతూ ఎంఐఎం నగర అధ్యక్షుడు ఇదివరకే ప్రకటించిన ఆగస్టు 16 నుంచి ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంలో అన్ని రకాల ప్రభుత్వ పరమైన సర్టిఫికెట్లు, ఆన్ లైన్ సేవలు ఉచితంగా ప్రజలకు అందుబాటులో కి తెస్తామన్నారు. స్వాతంత్ర్య వచ్చి 74 ఏండ్లు గడుస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు నేటికీ దారిద్య రేఖకు దిగువనున్న పేద ప్రజలకు అందలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరమైన సంక్షేమ ఫలాలు అందించేందుకు ఎంఐఎం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ల అఖీల్ ఫిరోజ్, మహమ్మద్ శర్ఫుద్దీన్, ఆతిన,కోఆప్షన్ సభ్యురాలు రాఫియ సుల్తానా, నాయకులు అహ్మద్, షాకిర్, సాజిద్, జావిద్, అన్నేమల్ల సురేష్, బిలాల్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లి , హన్మజిపేట మత్యుకారులు చేపల వేటకు వెళ్లకూడదు

మర్రిపల్లి గ్రామ చెరువు పరిశీలించిన ఎస్ఐ సౌమ్య రెడ్డి

వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి):ఎవేములవాడ రూరల్ గ్రామ ప్రజలు వర్షానికి బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలి వేములవాడ పరిసర ప్రాంతాల్లో గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు మత్యుకారులు చేపల వేటకు వెళ్లకూడదని వేములవాడ రూరల్ ఎస్ ఐ సౌమ్య రెడ్డి సూచించారు . వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామంలో చెరువు కట్ట కందుకం పడటంతో మత్యుకారులు వారం పాటు వేటకు వెళ్లకూడదని తెలిపారు . గ్రామంలో యువకులు కూడా ఈతలకు వెళ్లకూడదని అన్నారు.నాగయ్యపల్లి గ్రామ ప్రజలు రాత్రి సమయాల్లో చెరువుల వద్దకు వెళ్లకూడదని తెలిపారు . గ్రామంలోని ప్రజలు అవగాహన కల్పించారు . అనంతరం హన్మజిపేట నక్కవాగును పరిశీలించి వాహనాలు వెళ్లకుండా పలు బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు . వర్షాలు కురుస్తున్నా సందర్భంగా వేములవాడ రూరల్ గ్రామాల ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని

స్వదేశీ పరిజ్ఞానంతో యాంటీ డ్రోన్ వ్యవస్థ

-ఎర్రకోట వద్ద మొహరించిన అధికారులు

న్యూఢిల్లీ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): భాతర స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శనివారం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన యాంటీ డ్రోన్ వ్యవస్థను అధికారులు ఎర్ర కోట సమీపంలో శనివారం మోహరించారు. ఈ లేజర్ వెపన్ ఆకాశంలో 3 కిలోమీటర్ల పరిధిలోని డ్రోన్‌లను గుర్తించడమే కాక జామ్ చేయగలదు. అలానే 1-2.5 కిలోమీటర్ల దూరంలోని లేజర్ వెపన్ టార్గెట్‌లను వాటేజ్‌ను బట్టి చేధించగలదని

దేశ సేవలో పోలీస్ శాఖదే అత్యున్నత స్థానం- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి):భారతదేశంలోనే దేశ సేవా కోసం నిత్యం పోరాటాన్ని సాధించడంలో పోలీస్ శాఖ అత్యున్నత స్థానాన్ని కలిగి ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లాలోని ఏ. ఆర్ హెడ్ క్వాటర్స్ లో మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్, ప్రభుత్వ వివిధ శాఖలకు చెందిన అధికారులకు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మరియు భారతదేశమంతటా ఈరోజు ఆనందంగా జరుపుకుంటున్న స్వాతంత్ర్య దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, మనం ఒక అందమైన ప్రశాంతమైన జీవితాన్ని ఇవ్వడానికి ఎంతో మంది త్యాగధనుల పుణ్యఫలం స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణత్యాగం వలన స్వాసంత్రం సిద్ధించిందని స్వాతంత్ర్య వచ్చిన స్వయం పాలనలో మన దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, మనము కూడా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మన వంతు భాద్యతగా దేశసేవ కొరకు పాటుపడాలని, సిబ్బంది తమ విధులను భాద్యతాయుతంగా నిర్వహించి జిల్లా పోలీస్ వ్యవస్తకు మంచి పేరు ప్రతిష్ట తీసుకురావడానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది అందరూ కూడా బాగా కష్టపడుతున్నారని ముందు ముందు మీ ఆలోచనలో విషయ పరిజ్ఞానం మరింత పెంచుకోని నీతి నిజాయితీగా సేవలు అందించాలని సూచించారు.

పోలీసులు నిరంతరం శాంతిభద్రతలు కాపాడటంలో ఎంతో శ్రమించి ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటం లో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎందరో వీర జవాన్లు ఉగ్రవాదులు, తీవ్రవాదులు మరియు ఇతర సంఘ విద్రోహ శక్తులతో పోరాడి వారి ప్రాణాలను త్యాగం చేసినారు. తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యున్నత ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్న పోలీస్ వ్యవస్థగా పేరు పొందినది. కరోనా వ్యాధి నివారణ గురించి అధికారులు సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, తప్పకుండా శానిటైజర్, మాస్కులు, గ్లౌజులు వేసుకోవాలని బయట తిరిగే సమయంలో భౌతిక దూరం పాటించాలని, విధులు నిర్వహించడం ఎంత ముఖ్యమో, కరోనా వ్యాధి బారిన పడకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం అంతే ముఖ్యమని మనకు ఏమి కాదని నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఏమో అయిపోతుందని భయపడవద్దని, మనోధైర్యంతో ముందుకు వెళ్లి కరోనాను జయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు చంద్రశేఖర్ చంద్రకాంత్, ఆర్.ఐ లు సంపత్ కుమార్(అడ్మిన్), రజనీకాంత్, కుమారస్వామి సి.ఐ లు సర్వర్,రవికుమార్, శ్రీనివాస్ వెంకటనర్సయ్య ఎస్.ఐ లు డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ మండలంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు

వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలంలో 74 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి, కరోనా వ్యాధి నేపథ్యంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఏలాంటి ఆడంబరాలు లేకుండా నిర్వహించారు, తాసిల్దార్ అర్బన్ రూరల్ కార్యాలయంలో తాసిల్దార్ మునిందర్,శ్రీనివాస్, పట్టణ రూరల్ పోలీస్ స్టేషన్లో సీఐ లు వెంకటేష్, నవీన్ కుమార్ మండల పరిషత్ అర్బన్, రూరల్ కార్యాలయంలో ఎంపీపీ బుర్ర వజ్రమ్మ ,బండ మల్లేశం యాదవ్ , రమేష్, వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో , సెస్ కార్యాలయంలో డైరెక్టర్ జడల శ్రీనివాస్,శ్రీ రాజరాజేశ్వర స్వామిదేవస్థానం పరిపాలన విభాగం లో ఏవో హరికిషన్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మహేష్ రావు , వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ గడ్డం హనుమాన్లు , సింగిల్విండో కార్యాలయంలో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి , టిఆర్ఎస్ జండా వద్ద పార్టీ మండల అధ్యక్షులు రాజు , కాంగ్రెస్ జెండా వద్ద అధ్యక్షులు సాగర్ వెంకటస్వామి , అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సంఘాల వద్ద అధ్యక్షులు జాతీయ జెండాలను ఎగురవేశారు, ఈ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో జడ్పిటిసి రవి ,వైస్ చైర్మన్ మధు రాజేందర్ , ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

ప్రెస్ క్లబ్బులో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

-జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా.

వేములవాడ, ఆగష్టు 15 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని టి యు డబ్ల్యూ జే హెచ్ 143 ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 74వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లాయక్ పాషా జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు జై జవాన్.. జై కిసాన్.. వందేమాతరం .. జై భారత్.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ఫలితమే నేటి స్వతంత్ర దినోత్సవం దేశం కోసం పోరాడిన మహనీయులను త్యాగాలను గుర్తు చేస్తూ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భగత్ సింగ్ సుభాష్ చంద్రబోస్ లకు ఘనంగా నివాళులర్పించారు.

మహనీయులు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. దేశం కోసం పోరాడి అమరులైన లక్షలాదిమంది భారత అమరవీరులను స్మరించుకోవడం భారత దేశ పౌరునిగా మన అందరి బాధ్యత అన్నారు.

మాతృభూమి స్వతంత్రం కోసం పోరాడిన మహనీయులు చిరస్మరణీయులు అని వారి అమరత్వాన్ని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి పాశం, కార్యనిర్వాహక కార్యదర్శి గరదాస్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు నేరెళ్ల కమలాకర్, హరి, ప్రెస్ క్లబ్ సభ్యులు ఒడియాల వేణు, సయ్యద్ అలీ, నరేష్, రమణ, శ్రీధర్ ,ప్రదీప్, రాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు

పోలీస్ కార్యాలయాల్లో పంద్రాగస్ట్ వేడుకలు

జెండా ఎగురేసిన మూడుకమిషనరేట్ల సిపిలు

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): పోలీసు బలగాల సిబ్బంది 74వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రాజధాని నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలోని ఆయా ప్రధాన కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేట్ల బురుజ్‌లోని సిటి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఆరు నెలలుగా హైదరాబాద్ సిటీ పోలీసులు అద్భుతమైన పనితనాన్ని ప్రదర్శించారన్నారు. కోవిడ్-19 సంక్షోభంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జీవించారన్నారు. సైబరాబాద్‌లో డీసీపీ సి. అనసూయ(ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్) కమిషనర్ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేశారు. రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ భవనంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సుధీర్‌బాబు, అడిషనల్ డీసీపీ శిల్పవలి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ భగవత్ మాట్లాడుతూ... చట్టబద్ధమైన అన్ని కేసుల్లో పౌరులకు సహాయం చేయాల్సిందిగా సూచించారు. అదేవిధంగా కోవిడ్ రోగులకు వారి కుటుంబ సభ్యులకు సహాయం చేయాల్సిందిగా చెప్పారు. మానవతా సహాయంలో రాచకొండ పోలీసులు ఇప్పటికే ముందంజలో ఉన్నారన్నారు. సైబరాబాద్ కమిషనర్ సజ్జన్నార్ సిపి కార్యాయలంలో జెండా ఎగురేశారు. పోలీస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో పొంగుతున్న వాగులు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): అశ్వారావుపేటలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పాలవాగు, పెద్దవాగు, గుండేటి వాగు, మద్దులమాడ వాగు, లోతు వాగులు అన్ని గరిష్ఠ నీటి మట్టంతో వరద నీరు ప్రవహిస్తుండడంతో పెద్దవాగు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు పెద్దవాగు ప్రాజెక్టు 3 గేట్లను ఎత్తి దిగువకు 5,240 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. ఇదిలా ఉండగా మండలోని పలు చెరువులన్నీ అలుగులు పారుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మరాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొన్ని చెరువులకు పూర్తి స్థాయిలో అలుగుపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదల జీవితాల్లో మార్పే లక్ష్యంగా కృషి

వారిని వెలుగులోకి తెచ్చేలా అనేక పథకాల అమలు
ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా 14 నెలల పాలన
సమన్యాయం జరిగేలా మూడు రాజధానుల నిర్మాణం
త్వరలో విశాఖ కేంద్రంగా కార్యనిర్వాహక రాజధాని
విభజన చట్టం మేరకు ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే
విజయవాడ పతాకావిష్కరణలో సిఎం జగన్ ఉద్ఘాటన

విజయవాడ,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): పేదల జీవితాలు మార్చడానికి కృషి చేస్తున్నామని ఎపి సిఎం జగన్ అన్నారు. రైతు భరోసా, వైఎస్ఆర్ చేయూత, అమ్మఒడి, ఆసరా పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరినీ ఆదుకునే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కులం, మతం, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామమని అన్నారు. ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా 14 నెలల పాలన సాగిందన్నారు. దేశ 74వ స్వాతంత్య దినోత్సవ వేడుకలను ఆంధ్రప్రదేశ్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సాయుధ దళాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేక వాహనంపై ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాలను సీఎం వైఎస్ జగన్ వీక్షించారు. సంక్షేమ పథకాలు ప్రతిధ్వనించేలా ఏర్పాటు చేసిన శకటాలతో పాటు కరోనా కష్ట కాలంలో ఆరోగ్య సేవలకు గాను ఏర్పాటు చేసిన శకటాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనిలో భాగంగా ముందుగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్.. అనంతరం ప్రసంగిస్తూ స్వాతంత్య్ర సమరయోధులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. స్వాతంత్ర్యం ప్రాణవాయువు లాంటిందని గాంధీజీ చెప్పారు. రాజ్యాంగం, చట్టప్రకారం నడుచుకుంటేనే అభివృద్ధి సాధ్యం. ప్రజాస్వామ్యం ప్రకారం వ్యవస్థలు నడుచుకోవాలని అన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే పాలనా వికేంద్రీకరణ అని ప్రకటించారు. సమన్యాయం జరిగేలా మూడు రాజధానుల బిల్లును చట్టంగా మార్చాం అన్నారు. త్వరలో విశాఖ కేంద్రంగా కార్యనిర్వా హక రాజధానిని ప్రారంభిస్తామని అన్నారు. కర్నూలు కేంద్రంగా న్యాయ రాజధాని ఏర్పాటుకు పునాదులు వేస్తాం అన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక హోదాను అమలు చేయాలని గట్టిగా అడుగుతూనే ఉంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం మిగతా పార్టీలపై ఆధారపడే పరిస్థితి లేదు.. కాబట్టి ఇప్పటికిప్పుడు హోదా ఇచ్చే అవకాశం కనిపించకపోయినా.. ప్రత్యేక హోదాను ఖచ్చితంగా సాధించాలనే దృఢసంకల్పంతో ఉన్నాం. ఈరోజు కాకపోతే భవిష్యత్‌లోనైనా..కేంద్ర ప్రభుత్వం మనసు మారి ప్రత్యేక హోదా వస్తుందన్న నమ్మకంతో హోదా కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూనే ఉంటాం. సామాజిక, ఆర్థిక భరోసాను రాజ్యాంగం కల్పించింది. సమానత్వం పదాన్ని పుస్తకాలకే పరిమితం చేయకూడదు. ఆర్థిక పరిస్థితులు లేకున్నా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాం. విద్యాపరమైన అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తున్నాం,ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం అని అన్నారు. రైతు భరోసా ద్వారా అన్నదాతలకు ఆర్థిక సాయం చేస్తున్నాం. పేదలకు 30 లక్షల ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. అవినీతి లేని వ్యవస్థ కోసం రివర్స్ టెండరింగ్, జ్యుడీషియల్ ప్రివ్యూ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని అమలు చేస్తున్నాం అన్నారు. కేవలం మొదటి 14 నెలల పాలనలోనే వివిధ పథకాల ద్వారా దాదాపు రూ.46వేల కోట్లు ప్రజలకు నేరుగా అందించాం. చెట్టు ఎంత బాగా ఎదిగినా చీడ పురుగు పడితే ఎండిపోతుంది. అవినీతి అనేది చీడపురుగు. అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన ఫలాలు అందకుండా పోతాయి. ఈ నిజాన్ని గమనించబట్టే రివర్స్ టెండరింగ్, జ్యుడీషియల్ ప్రివ్యూ గత ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష ద్వారా రూ.4వేల కోట్లకు పైగా ఆదా చేశాం. ప్రభుత్వం చేస్తున్న ఖర్చుకు పూర్తిస్థాయి ఫలాలు మరో 10 నుంచి 20 ఏళ్లకు వస్తాయి. కాబట్టి ఇవి ఎన్నికల పథకాలు కావని అన్నారు. రాష్ట్ర ప్రజల సామాజిక, ఆర్థిక రాజకీయ చరిత్రలో మెరుగైన మార్పుల కోసం.. బాధ్యతతో, మనసుతో అమలు చేస్తున్న పథకాలుగా వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దాదాపు 33శాతం పేదలకు చదువుకునే అవకాశం లేదు. విద్యాపరమైన అంటరానితనాన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

వరదలపై అప్రమత్తంగా ఉండండి

సహాయక చర్యలు తీసుకోండి
మంత్రులు జిల్లాల్లోనే ఉండి పర్యవేక్షించాలి
భారీవర్షాలపై అధికారులతో చర్చించిన సిఎం కేసీఆర్

హైదరాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల అనేక చెరువులు అలుగుపోస్తున్నాయి. కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా చోట్ల రోడ్లపైకి నీరు వచ్చింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మంత్రులతో మాట్లాడారు. ఆయా జిల్లాల పరిస్థితిని సమీక్షించారు. తగు సూచనలు చేశారు.

హైదరాబాద్‌లో రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రులు తమ జిల్లాల్లోనే ఉండాలని స్థానిక కలెక్టర్, పోలీస్ అధికారులతో కలిసి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. చాలా చెరువులు పూర్తి స్థాయిలో నిండాయని ఫలితంగా కొన్ని చోట్ల చెరువులకు గండ్లు పడే అవకాశం ఉందని, వరదల వల్ల రోడ్లు తెగిపోయే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే పరిస్థితి ఉత్పన్నం కావచ్చని సీఎం చెప్పారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైందని దాదాపు అన్ని చెరువులు అలుగు పోస్తున్నాయని చెప్పారు. ఆ రెండు జిల్లాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం రెండు హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచింది. వరదల వల్ల చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు వాటిని వినియోగిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన హెలికాప్టర్‌తో పాటు సైనిక హెలికాప్టర్ కూడా అందుబాటులోకి వచ్చింది. మంత్రులు తమ జిల్లాల్లోనే ఉండాలని స్థానిక కలెక్టర్, పోలీస్ అధికారులతో కలిసి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. చాలా చెరువులు పూర్తి స్థాయిలో నిండాయని ఫలితంగా కొన్ని చోట్ల చెరువులకు గండ్లు పడే అవకాశం ఉందని, వరదల వల్ల రోడ్లు తెగిపోయే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే పరిస్థితి ఉత్పన్నం కావచ్చని సీఎం చెప్పారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైందని దాదాపు అన్ని చెరువులు అలుగు పోస్తున్నాయని చెప్పారు. ఆ రెండు జిల్లాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎడతెరిపిలేని వర్షాలకు తడిసి ముద్దయిన ఉమ్మడి జిల్లా

-పొంగిప్రవహిస్తున్న జంపన్న వాగు
మేడారం గద్దెలను తాకుతూ ఉధృతంగా ప్రవాహం
నిండుకుండల్లా ప్రధాన చెరువులు
చలివాగులో చిక్కుకున్న 12మంది రైతులు

వరంగల్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలకు ఉమ్మడి వరంగల్ జిల్లా తడిసి ముద్దయ్యింది. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు పూర్తిగా నిండి ప్రమాద స్థాయికి చేరుకునాయి. ప్రధాన జలాశయాలు అయిన లక్నవరం,రామప్ప,భద్రకాళి తదితర చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. మరోవైపు జంపన్న వాగు పొంగి ప్రవహిస్తోంది.ములుగు జిల్లా జంపన్న వాగు పొంగి పొర్లుతుంది. మేడారం గ్రామం పూర్తిగా జంపన్న వాగులో ఉండి పోయింది. చరిత్రలో మొట్టమొదటి సారిగా వర్షపు నీరు గ్రామన్నే చుట్టేసింది. మేడారం గ్రామ బ్రిడ్జిపై నుండి వరద నీరు గ్రామంలోకి చేరుతున్నది. ప్రస్తుతం మేడారం గద్దెల సమీపంలోని ఐటిడీఏ కార్యాలయానికి జంపన్న వాగు నీరు తాకింది. ఇప్పటికే చిలుకల గుట్టను తాకి గద్దెలవైపుగా పయనిస్తున్న వరద.. మేడారం అమ్మవార్ల గద్దెలను తాకనున్నది. ఆ ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ఇప్పటికే అక్కడ జనజీవనం పూర్తిగా స్తంబించి పోయింది. పోలీసులు పస్రా నుండి మేడారంనకు రవాణా సౌకర్యాలను పూర్తిగా నిలిపివేశారు. ఊరట్టం వద్ద జంపన్న వాగు నీరుభారీగా వెళుతున్నది. మూడ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పరకాల నుంచి అంబాల మీదుగా హన్మకొండ చేరుకునే దారిలో నడికుడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామం వద్ద లోలెవల్ వంతెన మీదుగా వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. పులిగిల్ల నుంచి ఓ బస్సు హన్మకొండకు వెళ్తుండగా ఈ లోలెవల్ వంతెన మీద వరద నీటి ప్రవాహంలో చిక్కుకుంది. శుక్రవారం రాత్రి ఈ బస్సు వరదలో చిక్కుకోగా ఉధృతి తక్కువగా ఉండడంతో డ్రైవర్, కండక్టర్, ఇతర ప్రయాణికులు దిగి బయటికి రావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. శనివారం ఉదయం వరద ఉధృతి భారీగా పెరుగు తుండడం తో బస్సు కొట్టుకుపోవచ్చని స్థానికులు భావిస్తున్నారు. శనివారం టేకుమట్ల మండలం కుందనపల్లి వద్ద చలివాగు వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు దాటే ప్రయత్నంలో 12 మంది రైతులు నీటి ప్రవాహంలో చిక్కుకున్నారు. పోలీసులు, రెస్క్యూ టీం వారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అవి సఫలం కావడంలేదు. ఎటు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డికి సమాచారం అందించారు గ్రామస్థులు. ఈ మేరకు ఎమ్మెల్యే పరిస్థితి గురించి ఫోన్ లో మంత్రి కేటీఆర్ కు తెలియజేశారు. స్పందించిన కేటీఆర్ రైతులను కాపాడేందుకు హెలికాప్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. సంఘటనా స్థలానికి హెలికాప్టర్ చేరుకొని రైతులను కాపాడనున్నట్లు సమాచారం.

వరదలతో అప్రమత్తంగా ఉండండి

చెరువులు,కుంటలు తెగకుండా చూడాలి
ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా వ్యవహరించండి
జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించిన మంత్రి సత్యవతి

మహబూబాబాద్,ఆగస్ట్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో విధుల్లో ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. ఈ వర్షాల వల్ల చెరువులు, ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరుతోందని, చెరువులకు గండ్లు పడకుండా ప్రాజెక్టుల్లో నీటి లెవల్స్ నిర్వహించడం కోసం ఇరిగేషన్ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. రోడ్లు గుంతల పడి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా జిల్లా పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఐదు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం ఆమె ఫోన్లో మాట్లాడారు. జిల్లాల్లో ఏదైనా అత్యవసర సాయం కోసం కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని మహబూబాబాద్, ములుగు, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాల పల్లి, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని ఎలాంటి అవాంఛనీయ పరిస్థితి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జాగ్రత్త వహించాలన్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాలు భారీగా ఉన్నందున ప్రజలు కూడా సహకరించాలని, అత్యవసరమైతేనే రోడ్లమీదకు వెళ్లాలని, ఏదైనా ప్రమాదం ఉన్నట్లు దృష్టికి వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ అధికారులు వర్షాల నేపథ్యంలో ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మంత్రిగా తాను మహబూబాబాద్లోనే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చన్నవారు.

కరోనా నిరోధానికి చర్యలు తీసుకోవాలి

జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఆమె జెండా వందనం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో స్థానిక ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, కలెక్టర్ వీపీ గౌతమ్, ఎస్పీ కోటిరెడ్డి, ఇతర జిల్లా అధికారులతో కలిసి కొవిడ్- 19పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు కొత్తగా ఐదు డాక్టర్ పోస్టులు మంజూరు అయ్యాయని మంత్రి వెల్లడించారు. కరోనా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన వైద్య సామాగ్రి, వసతులు కల్పిస్తున్నామని, వీటితోపాటు అదనపు వైద్య సిబ్బందిని కూడా మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా కరోనా వైరస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్యంతో పాటు వారికి మానసిక స్థైర్యం కల్పించాలన్నారు. అనంతరం కొవిడ్ బాధితులకు ఫ్రూట్ జ్యూస్ టిన్స్ పంపిణీ చేశారు.

(మొదటి పేజీ తరువాయి...)

ఆత్మనిర్భర భారత్ మన లక్ష్యం

చేసేందుకు స్నేహ హస్తం అందిస్తున్నామన్నారు. దక్షిణాసియాలోని ప్రతి దేశంతో భారత్ కలిసి పని చేయాలని కోరుకుంటుందని, వేలాది సంవత్సరాలుగా సంవత్సరాలుగా సముద్ర తీర దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉందని మోదీ గుర్తు చేశారు. అలాగే తూర్పు ఆసియా దేశాలతోనూ భారత్ స్నేహపూర్వక సంబంధాలు ఏర్పాటు చేసుకుందన్నారు. నియంత్రణ రేఖ వెంబడి లేదా వాస్తవాధీన రేఖ వెంబడి మన దేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేసిన వారికి వారి భాషలోనే మన సైనికులు సరైన జవాబిచ్చారు. వారికి ఏ భ్గా÷ల్గ÷తే అర్థమవుతుందో అదే భాషలో జవాబిచ్చారు. ఉగ్రవాదం, విస్తరణవాదానికి సహాయపడే శక్తులను, వాటిని బలపరిచే శక్తులను ఓడించడానికి భారత్ సదా సిద్ధంగానే ఉంటుంది' అని ఆయన స్పష్టం చేశారు. లడఖ్‌లో చైనా అతిక్రమణతో పాటు మన దేశ సైనిలిచ్చిన జవాబును ప్రపంచం మొత